

## నేడు గ్రేటర్ ప్రజాప్రతినిధులతో

# కేటీఆర్ కీలక సమావేశం

సిటీబ్యూరో, జూలై 4 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన శుక్రవారం తెలంగాణ భవన్‌లో గ్రేటర్ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లతో సమావేశం జరగనున్నది. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. శనివారం జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం (కౌన్సిల్) ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఇప్పటికే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలోనే కౌన్సిల్‌లో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 5 జూలై 2024 | HYDERABAD







*రూ.వెయ్యికే గజం.. 50 గజాలకు రూ.50 వేలు.. 100 గజాలు కావాలంటే లక్ష రూపాయలు... ఇదేదో మారుమూల ప్రాంతంలో కాదు..విజయవాడ జాతీయ రహదారికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోనే..కాకపోతే కొనుగోలు చేసిన తర్వాత ఈ స్థలంలోని గుడిసెలో కనీసం మూడు రోజుల పాటు నిద్ర చేయాలి. లేకపోతే మరుసటి రోజే అది వేరే వాళ్ల పేరు మీదకు మారుతుంది. మరి... ఇంతకీ ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు, పట్టాలు ఉంటాయా అంటే అవేవీ ఉండవు. అక్కడో ప్రైవేటు సైన్యం ఉంటుంది. వాళ్లు ఒక రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేసుకుంటారు అంతే..*

# ₹1000కి చదరపు గజం!

- కుంట్లూరు భూదాన్ భూముల్లో యథేచ్ఛగా గుడిసెల దందా
- ఏడాది కిందట రాత్రికి రాత్రే వెలిసిన వేలాది గుడిసెలు
- ఎలాంటి హక్కులు లేకుండానే చేతులు మారుతున్న స్థలాలు
- కోర్టులో వివాదం నడుస్తున్నా..కొనుగోలు చేసి మోసపోతున్న అమాయకులు



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 4 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధి పాపాయిగూడలోని 214-225 సర్వేనంబర్లలోని భూముల వాస్తవ పరిస్థితి అది. నిజానికి ఈ భూమికి సంబంధించి టైటిల్ వివాదమే న్యాయస్థానంలో ఉంది. ఈ సర్వే నంబర్లలోని దాదాపు వందెకరాల భూములు తమవి అని కొందరు.. కాదు కాదు భూదాన్ బోర్డు ట్రస్టుకు రాసిన భూములు అని ట్రస్టు వాళ్లు వాదిస్తున్నారు. దీంతో ఏండ్ల తరబడి వివాదం న్యాయ స్థానంలోనే ఉన్నది. కానీ గత ఏడాది జనవరిలో రాత్రికి రాత్రే ఈ భూముల్లో వేలాది గుడిసెలు వెలిశాయి. ఇటీవల మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల్లోకి నిరుపేదలు తరలివచ్చినట్లే ఇక్కడ కూడా వందలాదిగా తరలివచ్చి గుడిసెలు వేసుకున్నారు. కొంత కాలం ఉంటే ఆ స్థలం తమకు చెందుతుందనే ఆశతో ఇతర జిల్లాలు, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నిరుపేదలు వచ్చారు. కనీసం నీళ్లు, కరెంటు, ఇతరత్రా సాధారణ సౌకర్యాలు లేకున్నా.. నెలల తరబడి ఆ గుడిసెల్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలోనే కొందరు దళారులు అక్కడ రంగ ప్రవేశం చేశారు. ఉదయం వేళల్లో ఎక్కడ పనికి వెళ్లినా.. రాత్రికి మాత్రం తమ గుడిసెల్లోకి రావాల్సిందేనన్న నిబంధన విధించారు. ఎవరైనా రాత్రివేళల్లో గుడిసెల్లో నిద్రించేందుకు రాకుంటే వెంటనే ఆ గుడిసెను వేరే వారికి కేటాయిస్తున్నారు. దీంతో కొంతమంది అక్కడి నుంచి వెళ్లిపోగా... చాలామంది రోజంతా ఎక్కడ పని చేసినా.. రాత్రయ్యే సరికి అక్కడికి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడిన వారు కూడా ఉన్నారు. కాగా, దళారులు గుడిసె వాసుల నుంచి క్రమంగా డబ్బులు వసూలు చేయడం మొదలుపెట్టారు. తొలుత రూ.5వేల నుంచి మొదలైన ఈ పర్వం ఇప్పుడు రూ. 50వేలు, లక్షల్లోకి వెళ్లింది.

### ఎలాంటి హక్కులు లేకుండానే..

ఆ గుడిసెల్లో ఉన్న వారికి ఆ భూమి ఎవరిది? అనేది తెలియదు. కానీ కొన్నేండ్ల పాటు అక్కడే ఉంటే ప్రభుత్వం పట్టాలు ఇస్తుందనే ఆశతో అలాగే ఉంటున్నారు. అయితే గత కొన్నిరోజులుగా దళారుల ప్రమేయంతో ఆ గుడిసెలు చేతులు మారుతున్నాయి. సుమారు 40 చదరపు గజాల విస్తీర్ణంలో వేసిన గుడిసెలను గజానికి రూ. వెయ్యి చొప్పున విక్రయిస్తున్నారు. కాస్త విస్తీర్ణం ఎక్కువగా ఉంటే రూ. 50వేలు, రూ. లక్ష వరకు ధర పలుకుతున్నది. ఈ లావాదేవీలకు సంబంధించి ఎలాంటి పత్రాలు ఉండటం లేదు. కేవలం అక్కడ ఉండే దళారులు తమ రిజిస్టర్లలో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన వారు కూడా కచ్చితంగా రాత్రివేళల్లో అందులో నిద్రించాల్సిందే. వరుసగా మూడు రోజులు లేకుంటే.. అది వేరే వాళ్లకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌లో కూలీనాలీ చేసుకుంటున్న వాళ్లే ఇంత నీడ దొరుకుతుందనే ఆశతో మోసపోతున్నారు. వీటిపై రెవెన్యూ, పోలీసు శాఖలకు భారీ ఎత్తున ఫిర్యాదులు అందినా.. వేలాది మందిగా ఉన్న నిరుపేదలు.. పైగా ఆ ప్రాంతాన్ని అనధికారికంగా తమ చేతుల్లోకి తీసుకున్న ఒక ప్రైవేటు సైన్యం అధికార యంత్రాంగం మీద తిరగబడేందుకు సిద్ధమవుతున్నదని ఒక అధికారి తెలిపారు. కొన్నిరోజుల కిందట పోలీసులు భారీ బలగాలతో గుడిసెల తొలగింపునకు రంగం సిద్ధం చేసినా... విషయం తెలుసుకున్న గుడిసెవాసులు కారం, కర్రలతో తిరుగుబాటుకు సిద్ధం కావడంతో పోలీసులు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. అనంతరం రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు వెళ్లి గుడిసెలను ఖాళీ చేయాల్సిందిగా వారిని హెచ్చరించారు. దీంతో గుడిసెవాసులు కొంతమంది సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అది భూదాన్ భూమి అయినందున ఇండ్ల స్థలాల కింద తమకు వాటిని కేటాయించాల్సిందిగా కోరారు.

### గాడి తప్పుతున్న వ్యవస్థ..

గుడిసెలు వెలిసిన ప్రాంతం ఒక సామ్రాజ్యంగా మారడంతో పాటు అక్కడ కొందరు వలంటీర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు అనేక మంది బాధితులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో పెద్ద ఎత్తున అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. దీంతో గుడుంబా, గంజాయి వాడకం పెద్ద ఎత్తున జరుగుతుండటంతో శాంతిభద్రతలు గాడి తప్పుతాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. చోరీలు సైతం పెరిగినట్టు తెలుస్తున్నది. ఈ గుడిసెలో ఏం పోయినా ఎవరిపై ఫిర్యాదు చేయాలో కూడా తెలియక, కిమ్మనకుండా ఉండిపోతున్నట్టు సమాచారం. చోరీల విషయంపై బాధితులు స్థానిక నేతలకే ఫిర్యాదు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక అక్కడ నిత్యం జరిగే గొడవలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రాత్రి సమయాల్లో ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వారు కూడా భయపడే పరిస్థితి నెలకొంది.



గురువారం ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సమావేశమైన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జర్నలిస్టులు వర్దెల్లి వెంకటేశ్వర్లు, రమేశ్ హజారీ

# ఎకో పార్కు.. పూర్తికాలేదు

### 'ఉప్పల్ భగాయత్' పనులన్నీ బల్దియా, వాటర్‌బోర్డుకు అప్పగించాం

### 'నమస్తే' కథనాలపై హెచ్ఎండీఏ వివరణ

సిటీబ్యూరో: హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పెండింగ్ పనులపై ఆ శాఖ అధికారులు స్పందించారు. 'ఎకో పార్కు పట్టించుకోరూ.. సమస్యల వలయంలో ఉప్పల్ భగాయత్' పేరిట 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించిన కథనాలకు వివరణ ఇచ్చారు. నెక్లెస్ రోడ్డులోని ఎకో పార్కు ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నదని, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఫుడ్ కోర్టు, లగ్జరీ వుడ్ కాటేజీలు, ఇన్ఫినిటీ పూల్ వంటివి పూర్తి కాలేదని, ప్రస్తుతం టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు తెలిపారు. వీటిని పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించగా... కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదన్నారు. అదే విధంగా 'సమస్యల వలయంలో ఉప్పల్ భగాయత్' అనే కథనానికి వివరణ ఇచ్చిన అధికారులు.. మౌలిక వసతులకు సంబంధించిన పనులన్నీ బల్దియా, వాటర్ బోర్డు శాఖలకు అప్పగించామన్నారు. పార్కులు, రోడ్లు, స్ట్రీట్ లైట్లు, ఇతర సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశాలు నిర్వహించామని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

# ఆ అధికారులకు అందలం

### అవినీతి ఆరోపణలు ఉన్నవారికే పోస్టింగ్‌లలో ప్రాధాన్యత

సిటీబ్యూరో: నిజాయతీ, ప్రతిభ ఆధారంగా బదిలీలు జరుగుతాయని ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నా.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారికి హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో ఇటీవల జరిగిన పోస్టింగ్‌లలో ప్రాధాన్యత ఇచ్చారని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతున్నది. రాజకీయ ఒత్తిళ్ల ప్రమేయం లేకుండా పారదర్శకమైన పోస్టింగ్‌లు ఇస్తున్నామంటూ చెబుతున్నా ఉన్నతాధికారులు ఆయా అధికారుల గతం గురించి పూర్తిస్థాయిలో ఆరా తీయకుండానే బదిలీలు చేస్తూ..వారికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలున్నాయి. గతంలో వెస్ట్ జోన్‌లో పనిచేసిన ఓ ఇన్‌స్పెక్టర్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. సదరు అధికారికి తిరిగి కీలక పోస్టు ఇచ్చారు. ఎలక్షన్ సమయంలో ఇక్కడి నుంచి మల్టీజోన్‌కు వెళ్లి తిరిగి.. తాజా పోస్టింగ్‌లో కీలకమైన పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా మరో అధికారికి బాధ్యతలు ఇచ్చారు. అతనిపై కూడా అవినీతి ఆరోపణలున్నాయి. రాచకొండలో చీటింగ్ కేసు ఎదుర్కొంటున్న ఓ అధికారి ఈస్ట్‌జోన్‌లో పోస్టింగ్ సాధించారు. అలాగే సైబరాబాద్‌లో రాజేంద్రనగర్, మేడ్చల్ జోన్లలో ఇటీవల పోస్టింగ్ అయిన ఇద్దరు అధికారులపై కూడా అవినీతి ఆరోపణలున్నాయి. ఇలా పలువురు అధికారులపై ఆరోపణలు ఉండటంతో పాటు చార్జీ మెమోలు కూడా జారీ అయ్యాయి. అయినా కూడా పోలీసు ఉన్నతాధికారులు ఆ విషయాలను పట్టించుకోలేదా..ఏదైనా రాజకీయ ఒత్తిళ్లతో వారికి పోస్టింగ్‌లు ఇచ్చారా? అనే చర్చ జరుగుతున్నది. రెండు కమిషనరేట్ల బాస్‌లకు రాజకీయ పైరవీలు నచ్చవు..ప్రతిభ ఆధారంగా వారికి తగిన గుర్తింపు ఇస్తారనే టాక్ ఉన్నది. అలాంటిది తాజా బదిలీల్లో కొందరికి ప్రాధాన్యత ఇవ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# గ్రేటర్ @ 33.6 డిగ్రీలు

సిటీబ్యూరో, జూలై 4 (నమస్తే తెలంగాణ): పశ్చిమ, నైరుతి దిశల నుంచి తెలంగాణ వైపు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.6, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.2 డిగ్రీలు, గాలిలో తేమ 56 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు.



## క్షేత్రస్థాయిలో పర్యటించండి: కమిషనర్ ఆమ్రపాలి

కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ప్రతి రోజూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. గురువారం చాంబర్‌లో ఆమె జోనల్ కమిషనర్లతో సమావేశాన్ని నిర్వహించారు. జోనల్ కమిషనర్లతో పాటు డిప్యూటీ కమిషనర్లు తమ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికతో పాటు సంబంధిత ఫొటోలు కూడా పంపించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఒక్కొక్క అంశంపై ప్రజలకు వివరించాలన్నారు. డెంగీ నివారణకు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సంబంధిత ఎంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా, ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, రవికిరణ్, ఉపేందర్‌రెడ్డి, పంకజ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలి

జీవీపీల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ ఆమ్రపాలి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి.. శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. కూకట్‌పల్లి, మూసాపేట, భరత్‌నగర్, రైతుబజార్ ప్రాంతాల్లో పర్యటించి.. వీధుల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలు జోనల్ కమిషనర్లు వారి ప్రాంతాల్లో పర్యటించాలన్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్లు శానిటేషన్‌పై ఆకస్మికంగా తనిఖీ చేశారు.



బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి

# 'అభివృద్ధి' పెండింగ్!

### వివిధ పనులకు సంబంధించిన చెల్లింపులూ వాయిదా

## రహదారుల విస్తరణ కోసం ఆస్తుల సేకరణకు ఒకే

### కల్నల్ సంతోష్‌బాబు భార్య సంతోషికి 711 చ.గ స్థలం కేటాయింపు

### గోపన్‌పల్లిలో జంతు సంరక్షణ కేంద్రం

### 'స్టాండింగ్ కమిటీ'లో 8 అంశాలకు సభ్యుల ఆమోదం



సిటీబ్యూరో, జూలై 4 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం మూడో స్టాండింగ్ కమిటీ సమావేశం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ కమిటీ సమావేశంలో 8 అంశాలు, ఒక టేబుల్ ఐటమ్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. ఆమోదించిన ఎనిమిది అంశాల్లో ఎక్కువగా రోడ్లు, జంక్షన్ల అభివృద్ధికి సంబంధించి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. 2020 గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన ఘర్షణలో వీరమరణం పొందిన కల్నల్ సంతోష్‌బాబు భార్య సంతోషికి బంజారాహిల్స్ రోడ్ నం. 14లో 711 చదరపు గజాల స్థలాన్ని కేటాయిస్తూ.. స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ఖాదీర్, అర్చన, మహమ్మద్ నజీరుద్దీన్, గౌసుద్దీన్ మహమ్మద్, మన్నె కవితారెడ్డి, ఉప్పల పాటి శ్రీకాంత్, ఆవుల రవీందర్‌రెడ్డి, చింతల విజయశాంతి, కంది శైలజ, అధికారులు ఈఎన్‌సీ జియావుద్దీన్, ప్రాజెక్టు సీఈ దేవానంద్, సీఈ కోటేశ్వరరావు, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీశ్, శివకుమార్ నాయుడు, నళినీ పద్మావతి, గీతా రాధిక, యాదగిరి రావు, సునందరాణి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, శానిటేషన్, లేక్స్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలివీ..

జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తులు, యుటిలిటీస్‌కు జీఐఎస్ సర్వే, మ్యాపింగ్ పనులకు రూ. 21.98 కోట్లతో నియో జియో ఇన్ఫో టెక్నాలజీస్ ప్రై.లి ఏజెన్సీకి కేటాయించగా, ఇందుకు కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఆమోదించింది. పైపులైన్ రోడ్ నుంచి కుత్బుల్లాపూర్ మెయిన్ రోడ్ వయా వెన్నెల గడ్డ చెరువు ప్రతిపాదిత 18 మీటర్లు, 9 మీటర్ల రోడ్డు వెడల్పు, పైపులైన్ రోడ్డు నుంచి గజానన్ ఎన్‌క్లేవ్ వరకు 18 మీటర్ల రోడ్డు వెడల్పునకు 105 ఆస్తుల సేకరణ, కిషన్‌బాగ్ జంక్షన్, ఇండియానా హోటల్ నుంచి రోడ్ నం. 9, చింతల్‌మెట్ మీదుగా పిల్లర్ నంబర్. 202 వరకు ప్రతిపాదిత 30 మీటర్ల రోడ్డు వెడల్పునకు 418 ఆస్తుల సేకరణ, బార్కాస్ డివిజన్ మసీద్-ఈ-నూర్ ఇస్మాయిల్ నగర్ నుంచి బిస్మిల్లా కిరాణా స్టోర్, బండ్లగూడ వరకు ప్రతిపాదిత 18 మీటర్ల రోడ్డు వెడల్పునకు ప్రభావితమయ్యే 153 ఆస్తులను మాస్టర్‌ప్లాన్‌లో చేర్చి ఆమోదం తెలిపి ప్రభుత్వానికి పంపేందుకు కమిటీ ఆమోదించింది. ఉప్పల్‌పల్లి పీవీఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 178 నుంచి సన్‌రైజ్ కాలనీ ధాని రెసిడెన్సీ, సన్‌రైజ్ వ్యాలీ వరకు ప్రతిపాదిత 12 మీటర్ల రోడ్డు వెడల్పునకు 67 ఆస్తుల సేకరణకు ఆమోదించారు. గోపన్‌పల్లిలో జంతు సంరక్షణ కేంద్రం నిర్మాణ పనులను మెస్సర్స్ రాంకీ ఫౌండేషన్ సీఎస్ఆర్ సొంత నిధులతో చేపట్టి ఎన్జీవో ఆల్ ఫర్ యానిమల్స్ ఫౌండేషన్ 25 సంవత్సరాల పాటు వైద్య సదుపాయాల లీజుకు ఇచ్చేందుకు కమిటీ ఆమోదించింది.

### అభివృద్ధి పనులన్నీ పెండింగ్

స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో భాగంగా 11 అంశాలను ఎజెండాలో పెట్టి సుదీర్ఘంగా సభ్యులు చర్చించారు. రహదారుల విస్తరణ కోసం ఆస్తుల సేకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సమయంలో పలు చోట్ల జంక్షన్ అభివృద్ధి, ఇతర డెవలప్‌మెంట్ పనులకు సంబంధించి అంశాలను పెండింగ్‌లో పెట్టారు. మూసారాంబాగ్ బ్రిడ్జి పనుల్లో భాగంగా యుటిలిటిస్ షిఫ్టింగ్ పనులకు రూ. 3.97 కోట్లు, బేగంపేట ఆర్వోబీ మరమ్మతులు, పునరుద్ధరణకు రూ. 20కోట్లు, ఆర్కే పురం ఆర్వోబీ పునరుద్ధరణ పనులకు రూ. 6 కోట్లు, రహ్మత్‌నగర్ (పీజేఆర్ విగ్రహం) జంక్షన్ అభివృద్ధి పనులకు రూ. 5.17కోట్లు, యూసుఫ్‌గూడ జంక్షన్ అభివృద్ధి పనులకు రూ. 4.90 కోట్లు, ఐఎస్ సదన్ డివిజన్‌లో బాలాజీ నగర్ కాలనీ నుంచి బీఎస్ఎన్ఎల్ ఖాళీ స్థలం వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి రూ.4 కోట్ల పనులు పెండింగ్‌లో పడ్డాయి. వీటితో పాటు మేడ్చల్-మల్కాజిగిరిలో డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా చేసిన ఖర్చు చెల్లింపు పెండింగ్‌లో పెట్టారు. వీఎస్టీ స్టీల్ బ్రిడ్జికి రూ.139 కోట్ల అదనపు చెల్లింపును వాయిదా వేశారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం

### వ్యర్థ రహిత నగరంగా తీర్చిదిద్దుకుందాం

### అడ్‌హక్ కమిటీ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నగరాన్ని వ్యర్థ రహిత, స్వచ్ఛ నగరంగా రూపొందించుకోవడంలో ప్రజలను భాగస్వాములను చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం మేయర్ అధ్యక్షతన శానిటేషన్‌పై అడ్‌హక్ కమిటీ సమావేశం జరిగింది. నగరంలో చెత్త సమస్య పరిష్కారంపై చేపట్టాల్సిన చర్యలపై కమిటీ సభ్యులతో చర్చించారు. ప్రతి కార్పొరేటర్ తమ పరిధిలో ప్రజల్లో మార్పు తెచ్చేలా వారికి అవగాహన కల్పించాలని మేయర్ సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా స్వచ్ఛ ఆటోల్లో వేసేలా చూడాలన్నారు. రాంకీ ఏజెన్సీ వాహనాలు తప్పనిసరిగా వ్యర్థాలు ఎత్తి వేసేలా సరైన పర్యవేక్షణ ఉండాలని, ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారికి సూచించారు. శానిటేషన్‌ను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోనున్నట్లు మేయర్ తెలిపారు.

### ప్రజలకు అవగాహన కలిగేలా..

సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగేలా సంబంధిత ఏజెన్సీ వారి వివరాలు, ఫోన్ నంబర్లతో అన్ని ఏరియాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని మేయర్ సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయా సమస్యలపై చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రజల్లో మార్పు తీసుకురావాలని, ప్రతి ఇంటికీ స్వచ్ఛ ఆటో వెళ్లి చెత్త సేకరణ చేయాలని, ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛ ఆటోలోనే చెత్త వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. చెత్త తొలగించడంలో కొత్త టెక్నాలజీని వాడుకోవాలని సూచించారు. ఆదే విధంగా చెత్త వేయడానికి మొబైల్ బిన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీ మాట్లాడుతూ ఎక్కడా చెత్త సరిగ్గా తీయడం లేదని, గార్బేజ్ ఓవర్ ఫ్లో అవుతున్నదని, గార్బేజ్ పాయింట్స్ తొలగించాలని.. చెత్త సేకరణ క్రమం తప్పకుండా చేయాలని కోరారు. శాశ్వతంగా బిన్‌లను ఏర్పాటు చేస్తే బాగుంటుందని కార్పొరేటర్ డాక్టర్ సురేఖ అభిప్రాయపడ్డారు. చెత్త ఎత్తడంలో రాంకీ సంస్థ పూర్తిగా విఫలమైందని, పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని కార్పొరేటర్ డాక్టర్ ఆయేషా హుమేరా తెలిపారు. ఈ సమావేశంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు మధుసూదన్, మినాజ్, అదనపు కమిషనర్ రవికిరణ్, సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ప్రతినిధి రఘు, రాంకీ ఏజెన్సీ ప్రతినిధులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.